17న ఛలో విజయవాడ ఓపిఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ సుబ్బారెడ్డి పిలుపు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఈనెల 17వ తేదీ విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలుపుకోవడానికి కోర్టు, ప్రభుత్వం వారు కొన్ని షరతులతో అనుమతి ఇచ్చారని, కావున అందరూ 17వ తేదీ సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జరుగు నిరసన కార్యక్రమానికి సిపిఎస్ ఉద్యోగస్తులు అందరూ హాజరుకావాలని తిరుపతి జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ సిపిఎస్ ఈఏ రాష్ట్ర కార్యవర్గ పిలుపుమేరకు మధ్యాహ్నం భోజన విరామం సమయంలో ఏపీ సిపిఎస్ ఈఏ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో తిరుపతి జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఛలో విజయవాడ కార్యక్రమం సెప్టెంబర్ ఒకటవ తేదీన ప్రభుత్వం వారు అనుమతి లేని కారణంగా కోర్టుకు వెళ్లడంతో 17వ తేదీన తమ యొక్క నిరసనను తెలుపుకోమని కోర్టు ఇచ్చియున్నారన్నారు. ఈనెల 17వ తేదీ విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలుపుకోవడానికి కోర్టు, ప్రభుత్వం వారు కొన్ని షరతులతో అనుమతి ఇచ్చారని, కావున అందరూ 17వ తేదీ సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జరుగు నిరసన కార్యక్రమానికి సిపిఎస్ ఉద్యోగస్తులు అందరూ హాజరు కావలసినదిగా పిలుపునిచ్చారు. ఏపీ సిపిఎస్ఈఏ శ్రీకాళహస్తి అధ్యక్షుడు వి. గంగయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 17 వ తేదీన మనం నిరసన తెలుపుకొనుటకు కోర్టు అనుమతి ఉంది కాబట్టి మనకు ఎటువంటి అడ్డంకులు ఉండవు కాబట్టి మనము మన నిరసనను తెలిపి ఓపిఎస్ సాధనకు కృషి చేయవలసినదిగా శ్రీకాళహస్తి సిపిఎస్ ఉద్యోగస్తులు అందరు విజయవాడకు తరలి రావలసిందిగా కోరారు. ఏపీ సిపిఎస్సి జిల్లా అదనపు కార్యదర్శి అండ్ వెంకటగిరి తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎండి సలీం మాట్లాడుతూ మేము ఈ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు సిపిఎస్, మీరు ప్రవేశపెట్టే జిపిఎస్ కు మాత్రమే వ్యతిరేకం, కావున ప్రభుత్వం వారు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. సెప్టెంబర్ 17వ తేదీ ఆదివారం జరిగే చలో విజయవాడ వై నాట్ ఓపిఎస్ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా సిపిఎస్ ఉద్యోగస్తులు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి తాలూకా మహిళ కార్యదర్శి పర్జాన, గౌరవ అధ్యక్షుడు, సుధాకర్ అదనపు కార్యదర్శి రాకేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాహితీవేత్త లగడపాటి భాస్కర్ ఇకలేరు

శ్రీకాళహస్తిలోని స్వగృహంలో తుదిశ్వాస

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సాహితీ కురువృద్ధులు లగడపాటి భాస్కర్ (88) ఇకలేరు. వయసు పైబడటం, అనారోగ్యం కారణాలతో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఆయన స్వగృహంలో గురువారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. సాహితీ మిత్రులతో పాటు శిష్యులు, అభిమానులు, రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పించారు. లగడపాటి అంతిమ సంస్కారాలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. 2016లో శ్రీకాళహస్తి వేదికగా నభూతో నభవిష్యతి అన్న రీతిలో జాతీయ తెలుగు కవి సమ్మేళనం నిర్వహించడంలో లగడపాటి కీలక భూమిక పోషించారు. లగడపాటి మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు, రచయితలు ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీ వేత్తల నివాళి - లగడపాటి భాస్కర్ కు పలువురు సాహితీ వేత్తలు నివాళులు అర్పించారు. ఆయన మరణం తెలుగు సాహితీ లోకానికి, ధూర్జటి రసజ్ఞ సమాఖ్య కు తీరని లోటన్నారు. నివాళులు అర్పించిన వారిలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి, ధూర్జటి బృందం గొడుగుచింత గోవిందయ్య, షత్ర జయచంద్ర రావు, తీగల వెంకటయ్య , గురునాథం, గణేష్, రవీంద్ర, బాలముని శివ కుమార్, మునిసుబ్బారెడ్డి, డాక్టర్ నీరజ, జ్యోతి, అన్నపూర్ణ, పసుపులేటి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు. ప్రముఖుల నివాళి - లగడపాటి భాస్కర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నివాళులు అర్పించిన వారిలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు, టీడీపీ ఇన్ చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఘనంగా 'కలవగుంట' జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: అభిమానం ఉప్పొంగింది. ఆత్మీయులు తరంగమై తరలివచ్చారు. పల్లె పల్లెలో సేవా కార్యక్రమాలు. వందలాది మంది అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. యువనేత సమాజ సేవకు వారు మురిసి పోయారు. ఈ వేడుకలు చూసి వినాయక చవితి ముందే వచ్చిందనుకున్నారు. ప్రముఖ సంఘ సేవకులు, నిస్వార్థ సేవా పరులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి. ఈయన జన్మదిన వేడుకలు శుక్రవారం తొట్టంబేడు మండలంలోని 27పంచాయతీలతో పాటు శ్రీకాళహస్తిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్నేహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపగా పెద్దలు ఆశీర్వదించారు. కలవగుంట భరత్ రెడ్డి జన్మదినం సందర్భంగా తొట్టంబేడు మండలంలోని అన్ని పల్లెల్లో పండుగ సందడి నెలకొంది. తొట్టంబేడు మండలం రాంబట్లపల్లెకు చెందిన సంఘసేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి జన్మదిన వేడుకలు 27 పంచాయతీల్లోని అనేక గ్రామాల్లో అభిమానులు నిర్వహించారు. తొట్టంబేడు మండలంలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, చూసిరాత పుస్తకాలతో పాటు విద్యా సామాగ్రి అందజేశారు. పల్లెల్లో కేక్ లు కట్ చేసి భరత్ రెడ్డి పట్ల తమ అభిమానం చాటుకున్నారు. భరత్ రెడ్డికి వందలాది మంది శుభాకాంక్షలు తెలియచేశారు. భరత్ రెడ్డి చేసే సంఘ సేవను కొనియాడారు. ఈయనకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉండాలని అందరూ ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కలవగుంట భరత్ రెడ్డి స్నేహితులు, అభిమానులు, భరత్ యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన రాష్ట్ర సిఐఐ సభ్యుల బృందం

- పరిశ్రమలలో నూతన సాంకేతిక నైపుణ్యాలపై అధ్యయనం

విశాలాంధ్ర- వరదయ్యపాలెం : ఆంధ్రప్రదేశ్‌కి చెందిన 25 మంది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సభ్యుల బృందం రెండు రోజులు (గురువారం, శుక్రవారం) శ్రీసిటీని సందర్శించి, ఇక్కడ తయారీ పరిశ్రమలలోని సాంకేతిక నైపుణ్యాలను అధ్యయనం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ వారికి సాదర స్వాగతం పలికారు.శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుక్రవారం స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ విశిష్టతను వివరిస్తూ దేశంలోనే మెగా ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ అవతరించిందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' బాటలో ఆటోమొబైల్, ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ ఇతర వివిధ రంగాల నుండి పెట్టుబడులను ఆకర్షిస్తూ గ్లోబల్ బిజినెస్ గేట్‌వేగా శ్రీసిటీ ఆవిర్భవించిందన్నారు. జపాన్, యూరప్, యునైటెడ్ స్టేట్స్, భారతదేశం నుండి అత్యధిక పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు అయ్యాయని చెప్పారు. పలు గ్లోబల్ బ్రాండ్ ల ఉత్పత్తులు శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. శ్రీసిటీలోని కొన్ని ప్రముఖ పరిశ్రమలు అమలు చేసే ఉత్తమ పద్ధతులను, సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం పర్యటన లక్ష్యంగా సిఐఐ బృంద సభ్యులు తెలిపారు. పర్యటనలో భాగంగా పరిశ్రమలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చర్చా కార్యక్రమాల్లో పాల్గొని సంబంధిత కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను తెలుసుకున్నారు. ఈ బృందానికి సీఐఐ తిరుపతి జోన్ వైస్ చైర్మన్ పుష్పిత్ గార్గ్, జోన్ హెడ్ పి.చందన్ పట్నాయక్ నాయకత్వం వహించారు.

రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం తథ్యం

విశాలాంధ్ర -పాకాల : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం తథ్యమని పిసిసి కార్యదర్శి కలికిరి నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటుకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఇండియా కూటమి విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మణిపూర్ ఘటన, దళిత, మైనారిటీ, బీసీలపై దాడులను ప్రజలు మరిచిపోలేదని బిజెపి కి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని దీన్ని గ్రహించిన బిజెపి ఆ రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించకుండా దేశం మొత్తం జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కుట్ర పన్నుతొందని ఎన్నికలు ఎలా నిర్వహించిన బిజెపి తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉదయ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం జరిగే వారపు సంత

విశాలాంధ్ర - వరదయ్య పాలెం : వరదయ్యపాలెం మండలం చిన్న పాండురు అనే గ్రామ పంచాయితీ లో గత మూడు సంవత్సరాలగా వారపు సంత జరుగుతుంది చిన్న పాండురు పరిధిలోని అపోలో టైర్ అనే పరిశ్రమ పంచాయితీకి ప్రధాన ఆర్థిక వనరుగా ఉంటున్నది సదరు గ్రామ పంచాయతీ పరిధిలోని విశాలమైన మైదానం భూమిలో వారపు సంత గత మూడు సంవత్సరాలుగా జరుగుతుంది వారపు సంతలో స్థాయిని బట్టి 1 అంగడి కి 50 రూపాయల నుండి 100 రూపాయల వంతున పంచాయితీ వసూలు చేస్తుంది ఈ లెక్కన సుమారు ఒక సంవత్సని గాను నాలుగు లక్షలు రూపాయలు మూడు సంవత్సరాల కు 12 లక్షల రూపాయలు పంచాయితీకి ఆదాయం వస్తుంది ఇలా ఉండగా వారపు సంత నుండి వస్తున్న రాబడిని పంచాయితీ సర్పంచ్ మరియు కార్యదర్శి దుర్వినియోగం చేస్తున్నారని అక్కడ జన వాక్యంగా ఉంటుంది అపోలో టైర్ కంపెనీ మొత్తంలో ఆదాయం వస్తున్న మరియు వారపు సంతను నుండి రాబడి వస్తున్న పంచాయితీలో అంతంత మాత్రంగానే అభివృద్ధి పనులు సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు అంతేగాక అపోలో టైర్స్ కంపెనీ నుండి మరియు వారపు సంత నుండి వస్తున్న ఆదాయపు వనరులపై సంబంధిత అధికారులు విచారణ చేయవలసి ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పేద ప్రజలకు అండగా సీఎం : ఎమ్మెల్యే వెలగపల్లి

విశాలాంధ్ర - గూడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం గూడూరు రెండవ పట్టణ పరిధిలోని మాలవ్యనగర్ ప్రాంతంలోని 19వ సచివాలయం పరిధిలో 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. తొలుత వైకాపా నాయకులు, సచివాలయ కన్వీనర్ వినీష్ యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు నరసయ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సీసీ రోడ్డు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా కృషి చేశారని, అందులో భాగంగానే గూడూరు పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఇప్పటికే గూడూరులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి కూడా అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్కో సచివాలయానికి గాను 20 లక్షల చొప్పున అభివృద్ధి కొరకు కేటాయించారన్నారు. గూడూరు నియోజకవర్గంలో 100 సచివాలయాలకు గాను 20 కోట్లు అభివృద్ధి నిమిత్తం కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని సత్వర పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని, అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. సచివాలయ కన్వీనర్ వినీష్ యాదవ్ మాట్లాడుతూ దిగువ వీరారెడ్డిపల్లి 1, 2 సచివాలయాల ప్రాంతంలోని రోడ్లు ఎన్నో ఏళ్లుగా అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని, వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నామని, గత పాలకులు పట్టించుకోని విషయాన్ని కూడా స్థానిక ప్రజలు తనకు తెలుపగా వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సీసీ రోడ్లు మంజూరు చేశారని వార్డు ప్రజల కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే నేడు సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. గూడూరు ప్రజలు ఎమ్మెల్యేకు రుణపడి ఉన్నారని ఎమ్మెల్యే వరప్రసాదరావు నిజంగా ప్రజల పాలిట వరం. అంటూ కొనియాడారు. ఎమ్మెల్యే చలువ వల్లనే కక్షపూరిత రాజకీయాలు లేకుండా గూడూరు ప్రశాంతంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వానికి చిరునామా ప్రజా సేవే ఆయన పరమార్థం

పేదల పాలిట పెన్నిధి కలవగుంట భరత్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : మానవత్వానికి ఆయన చిరునామా. పేదల పాలిట పెన్నిధి. ప్రజా సేవే ఆయన పరమార్థం. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే సద్గుణం. సాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేద విద్యార్థులకు భరోసా ఇవ్వడం. యువతను క్రీడల్లో ప్రోత్సహించడం. సాంకేతిక కారణాలు చూపుతూ ప్రభుత్వం పింఛను ఇవ్వని వారికి తానే స్వయంగా వెళ్లి సొంత డబ్బు ఇచ్చి ఆదుకోవడం. దైవ కార్యాలకు ఆర్థిక సాయం చేయడం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సొంత డబ్బుతో మౌళిక వసతులు కల్పించడం. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిన ఈ సమాజంలో ఇన్ని సద్గుణాలు కలిగిన వ్యక్తి ఎవరబ్బా అనుకుంటున్నారా...? ఆయనే జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి... రాంబట్లపల్లె ముద్దు బిడ్డ కలవగుంట భరత్ రెడ్డి. కలవగుంట భరత్ రెడ్డిది తొట్టంబేడు మండలం రాంబట్లపల్లె. అయినా పెరిగింది మాత్రం శ్రీకాళహస్తిలోనే. డిగ్రీ వరకు చదివిన భరత్... చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకున్నారు. 2012 నుంచి కలవగుంట భరత్ రెడ్డి తొట్టంబేడు మండలం యువజన కాంగ్రెస్ లో కీలక పాత్ర పోషించారు. మండలంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఎస్సీవీ నాయుడు రాజకీయ కారణాలతో తెలుగుదేశం పార్టీలో చేరడంతో... దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మీద అభిమానంతో కలవగుంట భరత్ రెడ్డి వైసీపీలో చేరారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో వైసీపీ విజయం సాధించడానికి తనవంతు పాత్ర పోషించి శెభాష్ అనిపించుకున్నారు. అయితే ఎన్నికల అనంతరం కలవగుంట భరత్ రెడ్డికి స్థానిక వైసీపీ కీలక నేత తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో ఆయన తటస్థంగా ఉంటున్నారు. అయినా ఆయన వైఎస్ఆర్ మీద అభిమానంతో ఇతర రాజకీయ పార్టీల వైపు చూడటం లేదు. ఇతర పార్టీల నుంచి పిలుపు వచ్చినా సున్నితంగా తిరస్కరిస్తున్నారు. రాజకీయ పార్టీ అండ లేక పోయినా భరత్ రెడ్డి దిగులు చెందకుండా ప్రజా సేవ చేస్తూ ముందుకు పోతున్నారు.

15ఏళ్లుగా ప్రజా సేవ

కలవగుంట భరత్ రెడ్డి అతి చిన్న వయసులోనే ప్రజా సేవకు శ్రీకారం చుట్టారు. ఆయన వయసు ఇటీవలనే మూడు పదులు దాటింది. ఇప్పటికే ఆయన ప్రజాసేవ ప్రారంభించి 15ఏళ్లు దాటిందంటే నమ్మశక్యంగా లేదు కదా. అయినా నమ్మి తీరాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ప్రోత్సహించాలనే ఆశయంతో తొట్టంబేడు మండలంలో దాదాపు ప్రతి గ్రామంలో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. నేటికీ ఈ సేవ ఆయన చేస్తూనే ఉన్నారు. అందుకే ఏ గ్రామానికి వెళ్లినా భరత్ యువసేన ఉంటోంది. ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు ప్రతి యేటా ఈయన నోటు విద్యా సామాగ్రి పంపిణీ చేస్తారు. పరీక్షల సమయంలో పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన సామాగ్రి అందిస్తారు. పేద విద్యార్థుల చదువుకు తనవంతు ఆర్థిక సాయం చేస్తుంటారు. విద్యార్థులకు విద్యాపరంగా ఏ సాయం కావాలన్నా కలవగుంట భరత్ రెడ్డి చేస్తుంటారు. ఇక వర్షాకాలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పేదలకు అన్నదానం చేస్తుంటారు. తాగునీటి సమస్య ఉత్పన్నమైతే తన సొంత సొమ్ముతో తాగునీటిని ఈయన పంపుతూ ఉంటారు. ఇక 2017లో ఓ దినపత్రికలో విలేకరిగా చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ వచ్చారు. ఇప్పటికీ విలేకరిగా సేవలు అందిస్తూనే ఉన్నారు.

కొవిడ్ వేళ...

కొవిడ్ వేళ జనం ఎలా ఇబ్బందులు పడ్డారో మనకు తెలిసిందే. అలాంటి కష్ట కాలంలో కలవగుంట భరత్ రెడ్డి తొట్టంబేడు మండలంలో పలు గ్రామాల్లో పేదలకు నిత్యావసరుకులు, మాస్కులు, శానిటైజర్లు, కోడిగుడ్లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నాడు భరత్ చేసిన సేవలు నేటికీ ప్రజలు తలచుకుంటూ ఉన్నారు. కలవగుంట భరత్ రెడ్డికి దైవ భక్తి చాలా ఎక్కువ. అందుకే తన స్వగ్రామమైన రాంబట్లపల్లెలో తన సొంత నిధులతో అభయ ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. స్వామి వారి ఎత్తైన విగ్రహం అక్కడ ప్రతిష్టించారు. తొట్టంబేడు మండలంలో ఇదే ఎత్తైన విగ్రహం. ఇక కొండ్రాజులపల్లెలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూరి విరాళం అందజేసి తన దైవ భక్తి చాటుకున్నారు. తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈయన తన సొంత నిధులతో మౌళిక వసతులు కల్పించారు. రోగులకు బెడ్లు లేకపోవడంతో భరత్ రెడ్డి సొంత సొమ్ముతో వాటిని కొనుగోలు చేసి ఇచ్చారు. అదేవిధంగా కొన్ని సమయాల్లో ఇదే ఆస్పత్రికి తన సొమ్ముతోనే మందులు కొనుగోలు చేసి ఇచ్చారు. ఇప్పటికీ అక్కడ ఏదైనా అవసరం అయితే సాయం చేస్తూ భరత్ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కలవగుంట భరత్ రెడ్డి అనేక సేవలు అందిస్తున్నారు. వినియోగదారుల హక్కుల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వారికి అండగా నిలుస్తూ న్యాయ పోరాటం చేయిస్తున్నారు. ఈయన సేవలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. కలవగుంట భరత్ రెడ్డి చేస్తున్న సేవలకు పలు పురస్కారాలు దక్కాయి. ఈయనకు ఇప్పటి వరకు అశ్వ అవార్డు, ఫేమస్ ఐకాన్ అవార్డు, మహాత్మాగాంధీ అవార్డుతో పాటు పలు పురస్కారాలు వచ్చాయి. భవిష్యత్తులో ఈయనకు మరిన్ని అవార్డులు వస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. మానవత్వానికి చిరునామాగా ఉన్న కలవగుంట భరత్ రెడ్డి సరైన రాజకీయ వేదిక దొరికితే మరింత ప్రజా సేవ చేసే అవకాశం లభిస్తుందని అభిమానులు అంటున్నారు. రాజకీయ పార్టీల నేతలు ఈయన సేవలు వినియోగించుకుంటే వారికే మంచి జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేసే కలవగుంట భరత్ రెడ్డికి అంతా మంచి జరగాలని కోరుకుందాం.

దళితకులానికి నీవల్ల ఒరిగిందేంటి స్వామీ

జనసేన ఇంఛార్జి పొన్నా యుగందర్

విశాలాంధ్ర-వెదురు కుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం లో దళితులకు ఒరిగిందేంటని జనసేన నియోజకవర్గ ఇంచార్జి పొన్నా యుగుందర్ ప్రశ్నించారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్వేటి నగరం మండలం గడపగడపలో ఉపముఖ్య మంత్రి నారాయణస్వామి పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి మాట్లాడిన మాటలకు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి యుగంధర్ ప్రతిస్పందించారు.గత సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో గెలిచిన మీ ఎమ్మెల్యేలు ఇప్పటివరకు ఏమి పీకారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత కులానికి నువ్వు ఏమి చేసావు తర్వాత నీ బావమరిదికి సర్పంచి మీ భార్యకు జడ్పిటిసి పదవులు ఇచ్చావు.మీ సంతానానికి రాజకీయ వారసత్వం అప్పగిస్తున్నావు. అంతే తప్ప ఆరు మండలాల్లో ఒక ఎస్సీ గ్రామానైనా రోల్ మోడల్ చేసారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన స్వార్థం కోసం ఎస్ఆర్ పురం మండల జడ్పిటిసి రిజర్వేషన్ మార్చారన్నారు. కార్వేటి నగరం నుండి కొత్తపల్లి మిట్ట వరకు డబల్ రోడ్డు వేయడం, గంగాధర్ నెల్లూరు బ్రిడ్జిని వెడల్పు చేయడం, వెదురు కుప్పం మండలంలో డిగ్రీ కాలేజీ కట్టడం, ఆర్ కే వి బి పేట గ్రామంలో రోడ్డు వంటి అభివృద్ధి పనులు చేసి జనాల్లోకి వెళ్లాలన్నారు. 2024 సంవత్సరంలో నీతో కూడా ఉండేవాళ్లు, నియోజకవర్గంలో ప్రజలు మిమ్మల్ని ఇంటికి సాగనంపుతారని జోష్యం పలికారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం మండల అధ్యక్షులు శోభన్ బాబు, ఉపాధ్యక్షులు సురేష్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ ఉన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - చంద్రగిరి: జోరు వానలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకుల్లో అభిమానం సడలలేదు. తమ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు రిమాండ్ కు నిరసనగా మూడోరోజు నియోజకవర్గం యర్రావారిపాలెం మండల అధ్యక్షుడు దేశి రెడ్డి రఘునాథ సారథ్యంలో నాయకులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. వైఎస్ఆర్సిపి నాయకులు రాష్ట్రాన్ని యదేచ్ఛగా దోచుకుంటున్నారని ఏ తప్పు చేయని తమ అధినాయకుడు చంద్రబాబు నాయుడు పై స్కిల్ లో ఏదో జరిగిందంటూ ఎఫ్ఐఆర్ లో పేరు లేకపోయినా అర్ధరాత్రి పోలీసులును పంపి అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. తమ నాయకుడు ఏ తప్పు చేయడనే నమ్మకం తమకుందని నిప్పులా తొందరలో బయటకు వస్తాడు అన్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలంలోని నాయకులు ట్రాక్టర్లు, కార్లలో పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని వీర్ణమలపీ పెద్ద తాండా పంచాయితీ పరిధిలో కొత్తగా అర్హులైన సుమారు 64 మందికి వృద్దులకు పెద్ద తాండా సర్పంచ్ మోహన్ నాయక్ ఎంపీటీసీ రవి నాయక్‌లు పింఛన్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వృద్ధులకు నెల నెలా ఒకటో తేదీన వాలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి పెంక్షన్ అందజేయడం జరుగుతుందని ఇందులో భాగంగా నే కొత్తగా మంజూరైన మరో 64 మంది కి శుక్రవారం పంపిణీ చేయడం జరిగిందన్నారు కార్యక్రమంలో భాస్కర్ నాయక్ మరియు లబ్దిదారులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సోమల జూనియర్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవం

విశాలాంధ్ర - సోమల : సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవము మరియు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. సదరు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాధర్ నాయుడు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత ఇంజనీరింగ్ రంగానికి తన మేధస్సుతో ఎనలేని సేవలు చేశారని ప్రపంచ దేశాలను అబ్బురపరిచే విధంగా భారత జాతి కీర్తి ప్రతిష్టలు కందంతరాలకు వ్యాప్తి చేసిన ఇంజనీరింగ్ పితా మహుడు అని వివరించారు. ఈయన పుట్టినరోజుని ఇంజనీర్ల దినోత్సవంగా జరుపుతారు. ఈయన భారతదేశంలో అనేక నదులపై ఆనకట్టలు, వంతెనలు కట్టి నీటిపారుదల, త్రాగునీరు పథకాల ద్వారా జలవనరుల సద్వినియోగానికి అంతర్జాతీయంగా పేరుపొందాడు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అధికారి ఐ జయరాం మాట్లా డుతూ నేడు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం ప్రజా స్వామ్యానికి భారతదేశమే పుట్టినిల్లు అని చెప్పారు. రాజకీయ పక్షాలన్నీ ఏకతాటిపై నిలిచిన భారత ప్రజాస్వామ్యాన్ని సుసంపన్నం చేయాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు

విశాలాంధ్ర-పలమనేరు : రూరల్ మండల పరిధిలోని కొలమాసన పల్లి సెక్టార్ పరిధిలో శుక్ర వారం పౌష్టిక ఆహార వారోత్సవాల సందర్భంగా తల్లి పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఇందిరా ప్రియదర్శిని, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపి పి గజేంద్ర, సూపర్వైజర్ నగ్మాఅంగన్వాడి టీచర్లు , భారతి, రాణి,రెడ్డెమ్మ,నిర్మల,కాంతమ్మఆశ వర్కర్లు మహిళా పోలీసు వాలంటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీకి మూడు అంబులెన్సుల విరాళం

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝా శుక్రవారం రూ.93 లక్షలు విలువైన మూడు అంబులెన్సులను టీటీడీకి విరాళంగా అందించారు.ముందుగా అంబులెన్సులకు శ్రీవారి ఆలయం ఎదురుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాల తాళాలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ డిజిఎం వరదరాజులు, ఆర్ఎం సత్యనారాయణ, శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి, ట్రాన్స్‌పోర్టు డిఐ జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చిల్లకూరు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విడుదల చేసిన వితంతు మహిళ, వృద్ధాప్య, దివ్యాంగులకు సామాజిక భద్రత పింఛన్లుకు సంబంధించిన నగదును, చిల్లకూరు సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు అందచేసారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, చిల్లకూరు నేతలు పాల్గొన్నారు.

చిల్లకూరులో సిసి రోడ్డు నిర్మాణానికి పూజ

విశాలాంధ్ర-చిల్లకూరు : మండల కేంద్రం చిల్లకూరు హరిజన వాడలో శుక్రవారం యంయల్ ఏ వెలగపల్లి వరప్రసాద్ రావు 20 లక్షల రూపాయల రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న సిసి రహదారి నిర్మాణం పనులకు భూమి పూజ చేసారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ నేత కొట్టు అశోక్ , జడ్పీటీసీ మన్నెం తదితరులు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో పాత్రికేయులు నరేష్ మృతి

విశాలాంధ్ర-చిల్లకూరు : సీనియర్ పాత్రికేయులు వంకా నరేష్ (41)శుక్రవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై మోటార్ బైక్ పై ప్రయాణిస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సంఘటనా స్థలంలో లోనే ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం నిమిత్తం భౌతిక కాయాన్ని గూడూరు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిల్లకూరు పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మ్రతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, శ్రేయోభిలాషులు, బంధువులు భాదిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంబేద్కర్ విగ్రహా పనులు ప్రారంభించిన జడ్పిటిసి

విశాలాంధ్ర - ఐరాల : పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ జాతీయ రహదారి నాలుగు కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు దీనికోసం శుక్రవారం పూతలపట్టు జడ్పిటిసి దేనిక పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం జాతీయ రహదారి నాలుగు కూడలి వద్ద ఏర్పాటు చేయడం శుభ పరిణయమని ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించి పనులు వేగవంతం చేయాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో ఆకనం బట్టు సర్పంచ్ ఎమ్మెస్ మనీ. రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవరత్నం. జయపాల్. షణ్ముఖం. బాలాజీ. మనీ. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి సోమల మండల అధ్యక్షుడు గా ఎంపిక

విశాలాంధ్ర - సోమల : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి ఇప్పటికీ వైఎస్సార్ సోమల మండల అధ్యక్ష పదవి కి మూడో సారి గంగాధర్ రాయల్ ను ఎంపిక చేయడం హర్షదాయకమని స్థానిక ప్రజాప్రతినిధులు తెలియజేశారు. ఈ క్రమం లో గంగాధర్ రాయల్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో నాకు అధ్యక్ష పదవి ని ఇవ్వడం తో ఆయన కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇన్ని రోజుల మండలం లో బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అందజేయడానికి నాకు సహాయ సహకారాలు అందించిన అధికారులు కు, ప్రజా ప్రతినిధులు కు వాలంటీర్ లకు, కన్వీనర్ లకు, గృహసారదులకు మరియు అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకం తో ఈ పదవి ని కట్టబెట్టిన తరుణంలో పార్టీ అభివృద్ధి కి నా వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియ జేసారు.

వీల్ చేర్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం ఏరియా ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున వికలాంగుల కొరకు కుప్పం ఏరియా ఆసుపత్రికి ఐదు వీల్ చేర్లను ను ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో వికలాంగులకు అనుకూలంగా ఉండేందుకు కుప్పం మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ అధర్వంలో ఏరియా ఆసుపత్రి సిబ్బందికి అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్,జడ్పీటీసీ శరవణన, కార్మిక నాయకులు రంగన్న, వార్డ్ కౌన్సిలర్లు జగన్, అరవింద్, నాగరాజు,ఆంజనేయ స్వామి గుడి చైర్మన్ కుమరేషన్, ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-చంద్రగిరి: తమ పిల్లల పుట్టిన రోజున ఆర్భాటాలకు పోకుండా అభాగ్యులకు అన్నదానం చేయాలని సంకల్పించారు ఆ దంపతులు. అనుకున్నట్లే ప్రతి యేటా తమ ఇద్దరు పిల్లల పుట్టినరోజున అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ ఎస్ఎస్ నగర్ కు చెందిన భూమిరెడ్డి నరేష్, భవాని దంపతులకు ఇద్దరు సంతానం. గురు, శుక్రవారాలు రెండు రోజులు పిల్లలు పుట్టిన రోజులు కావడంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గురువారం తమ కుమారుడు భూమిరెడ్డి తిశాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రాయలపురం పంచాయతీ వెంకటంపేట లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ లోని రాజస్థాన్ వలస కార్మికుల పిల్లలకు ఒక పూట భోజనం అందించారు. ఇందులో భాగంగా శుక్రవారం వారి కుమార్తె భూమిరెడ్డి దేవాన్షి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా, మండల పరిధిలోని నాగయ్యగారిపల్లి పంచాయతీ లోని అరుణోదయ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతుతున్న పండుటాకులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో సేవాగుణం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతీ ఏటా పిల్లల చేత అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకోవడం జరిగిందన్నారు. పుట్టిన రోజులు వేడుకలంటే ఆర్భాటాలు చేసుకోవడం కాదు.. పదిమందికి మన చేతనైన సాయం చేయాలనేదే వారి ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర, లలిత, లక్ష్మీ, వినయ్, ప్రియదర్శిని, సంపూర్ణమ్మ, హరీష్, సాయి, మల్లికార్జున, ఈశ్వరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

చిత్తూరులో బీసీ భవన్‌ను ప్రారంభించిన మంత్రులు

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు లోని పివికేఎస్ కాలేజీ సమీపంలో రూ.4.43 కోట్లతో నిర్మించిన మహాత్మా జ్యోతి రావు పూలే నూతన భవనాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నారాయణస్వామి రాష్ట్రఅటవీ, విద్యుత్,పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎం పి రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ ఎంఎల్‌సి భరత్, చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయనందరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ అధ్యక్షులు బుల్లెట్ సురేష్ ,రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్పర్సన్ శాంతి, డిఆర్‌ఓ రాజశేఖర్ ఇతర అధికార అనధికార ప్రముఖులు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరతను తీర్చండి

విశాలాంధ్ర -పుంగనూరు: మండలంలో ఉన్న రైతులకు యూరియా కొరత లేకుండా చేయాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రోజున మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అధికారులను నిలదీయడం జరిగింది. ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత వలన రైతులు పంటలు పండించలేకపోతున్నారన్నారు. అదేవిధంగా మండల పరిధిలో విద్యుత్ సమస్యలపై ఎంపిటిసిలు సర్పంచులు విద్యుత్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని నిలదీశారు. అలాగే రాష్ట్రంలో విద్యాశాఖలో జరుగుతున్న అభివృద్ధి అంశంపై ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి సమావేశం దృష్టికి క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశం దృష్టికి తెచ్చిన అన్ని సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నిధుల కొరత లేకుండా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అందుకనే అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు సరోజమ్మ ఈశ్వరమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి మండల కోఆప్షన్ సభ్యులు బావజన్ ఎంపీడీవో నారాయణ ఎమ్మార్వో సీతారామ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చౌడేపల్లె : చౌడేపల్లి మండలం, గద్దంవారి పల్లి పంచాయతీలోని 'బత్తలాపురం' గ్రామం నందు వాటర్ షెడ్ సౌజన్యంతో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి రైతుల నుండి విశేష స్పందన లభించింది. ఈ పశువైద్య శిబిరానికి చౌడేపల్లి జెడ్పిటిసి దామోదర్ రాజు,ఎంపీపీ రామ్మూర్తి, ఎంపీటీసీ శ్రీరాములు,సర్పం హరినాథ్, వాటర్ షెడ్ పి.ఓ.వర్మ,వాటరేజ్ చైర్మన్ పెద్దన్నలు హాజరయ్యారు. ఇందులో భాగంగా లేగదూడలలో నట్టల నివారణ మందును తాగించి,వాటి ఎదుగుదలకు కావలసిన మందులను పాడి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 70 పాడిశువులు,262 గొర్రెలకు,114 మేకలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మరియు సిబ్బంది,పాడిరైతులు పాల్గొన్నారు.

మండలం వైసిపి అధ్యక్షుడిగా చెరుకు నాదముని రెడ్డి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం వెంకట దాసరి పల్లెకు చెందిన మాజీ సర్పంచ్ చెరుకు నాదముని రెడ్డి ని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తమను నియమించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్సిపి చౌడేపల్లి మండల అధ్యక్షులుగా కె.అంజిబాబు

విశాలాంధ్ర-చౌడేపల్లె: మాజీ ఎంపీపీ కె.అంజిబాబు వైఎస్సార్సిపి పుంగనూరు నియోజకవర్గం,చౌడేపల్లి మండలం అధ్యక్షులుగా నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులను జారీ చేసింది.ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ మిథున్ రెడ్డి మరియు పెద్దిరెడ్డి కుటుంబంతో ఎంతో అనుబంధం కలిగి,మండలంలో పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ,పార్టీ బలోపేతానికి నిర్విరామ కృషి చేస్తున్న కె.అంజిబాబును పార్టీ అధిష్టానం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు.ఆయన పార్టీ మండల అధ్యక్షుడి పదవికి సరైన వ్యక్తి అని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కె.అంజిబాబు మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి అధిష్టానం చౌడేపల్లి మండల వైకాపా అధ్యక్షులుగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు.తనకు ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి,పెద్దిరెడ్డి కుటుంబానికి సహకరించిన స్థానిక పార్టీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం తొలి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చంద్రబాబు కోసం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -పాకాల : నారా చంద్రబాబు నాయుడు కేసుల నుండి బయటపడి తిరిగి రావాలని కోరుతూ శుక్రవారం మండలంలోని దామలచెరువు గ్రామపంచాయతీ పత్తిపాటివారి పల్లెలో వెలసియున్న శ్రీ శ్రీ సప్త కన్యకల దేవస్థానంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ పులివర్తి నాని సైతం ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. చంద్రబాబు నాయుడుని అక్రమ కేసుల్లో ఇరికించి టిడిపి కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికలలో అక్రమ మార్గంలో గెలవాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు త్వరలో అక్రమ కేసు నుండి బయటపడి తిరిగి రావాలని దేవతలను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల తో పాటు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదృశ్యం అయిన అమ్మాయి ఆచూకీ లభ్యం

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం అన్నెమ్మగారి పల్లి (పం)కి చెందిన బోనమంద లో కాపురం ఉన్న ఆనంద్ కు గీత అనే 18 సం.ల కుమార్తె ఉన్నారు. ఈ మె ప్రస్తుతం ఉన్నత పాఠశాల లో విద్య అభ్యసిస్తున్న దని తెలిపారు. ఇంతలో అమ్మాయి తల్లిదండ్రులు విద్యాభ్యాసం ను మాన్పించి పెళ్లి చేసుకోవాలని సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. అంత అమ్మాయి చదువుకోవడం ఇష్టం ఉన్నదని తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఇంటిలో ఉంటే పెళ్ళి చేస్తారని భయం తో ఎవరికి తెలియకుండా ఇంటిలో నుండి పారిపోయారు. అంతట ఆమ్మాయి తండ్రి ఆనంద్ గత నెల 28 వతేదీ న సోమల పోలీస్ స్టేషన్లో కని పించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ .సి.వి.నరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం వీరు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమ్మాయి గంగవరం మండలం గొర్రెల దొడ్డి గ్రామంలో వారి చిన్నాన్న దగ్గర ఉన్నట్లు సమాచారం అందుకున్న సోమల పోలీసులు అమ్మాయిని శుక్రవారం నాడు సోమల తహసీల్దార్ మాధవ రాజు సమక్షంలో హాజరు పరచి తల్లితండ్రులు అప్పజెప్పారు.ఈ సంఘటన తో అమ్మాయి తల్లిదండ్రులు సోమల పోలీసులు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు :జేసీ

విశాలాంధ్ర - రామకుప్పం : జగనన్న కు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీ లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు మండల కేంద్రంలో ని మండల అభివృద్ధికి సమావేశము మందిరంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల నుంచి వివిధ సమస్యల పై వచ్చిన వారిని సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందని అదేవిధంగా వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు సమస్యల పరిష్కరించేందుకు ఇంతకు ముందు జిల్లా కేంద్రానికి వ్యయ ప్రయాశలతొ వెళ్లి వారని దానిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంలో నే ప్రజలు తమ సమస్యల మండల స్థాయిలోనే జగనన్న కు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజల సమస్యల పరిష్కరించేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారం లో రెండు రోజులు ప్రతి బుధవారం మరియు శుక్రవారం మండల స్థాయి లో జగనన్న కు చెబుదాం కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ప్రజలు అందజేసిన సమస్యలు మండల స్థాయి లోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల స్థాయిలో పరిష్కారం కాకపోతే అందుకు సంబంధించిన సమాచారాన్ని అర్జీదారులకు వివరించాలని సంబంధించిన శాఖల అధికారులను ఆదేశించారు జగనన్నకు చెబుదాం స్పందన లో ఇచ్చిన ప్రతి అర్జీని కంప్యూటర్ లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు ఇవ్వడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, పి డి డిఆర్డీఏ తులసి డిపిఓ.లక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ మరియు సాధికారత అధికారి చిన్నారెడ్డి, డీఈఓ విజేయేంద్ర రావ్,ఆర్ బి ఎస్ఈ ఉమామహేశ్వర రెడ్డి, డి ఎల్ డి ఓ రవి కుమార్,వివిధ శాఖల మండల, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్ మురళి,ఎం పి డి ఓ రాధాకృష్ణ,ఎం పి పి సుబ్రహ్మణ్యం,జడ్పీటీసీ నితీశ్వర్ రెడ్డి మండల వైసీపీ అధ్యక్షుడు బాబు రెడ్డి కోకన్వీనర్ చంద్రారెడ్డి ఎంపీపీ సుబ్రహ్మణ్యం జెడ్పీటీసీ నితిన్ తదితరులు పాల్గొన్నారు .

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం :డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర-కార్వేటినగరం: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం గాజంకి సచివాలయ పరిధిలోని రౌతువానిగుంట, విరాటపురం, క్రిష్ణాపురం, దిగువ ఎర్రమరాజుపల్లి, ఎగువ ఎర్రమరాజుపల్లి, దళితవాడ, గాజంకి, గాజంకీ దళితవాడ, అమ్మోరుగుంట గ్రామాల్లో సర్పంచ్లు చిన్నబ్బరెడ్డి, హరోహరరెడ్డి, ఎంపీటీసీ పుత్తూరు రాధికారెడ్డి,మాజీ ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమాలు అందిస్తోందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ లక్ష నుంచి 6 లక్షల వరకు లబ్ధి చేరుకూరుందని తెలిపారు. పేదల పాలిట కల్పవృక్షంగా నిలుస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో భాగంగా రౌతువాని గుంట దళితవాడ, విరాటపురం గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇళ్లపైన ఉందని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే తొలగించాలని విద్యుత్ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. అలాగే ఎర్రరాజుపల్లి,గాంజకి,గాజంకి దళితవాడలో మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలని చెప్పడంతో స్పందించిన మంత్రి వెంటనే మురుగు నీటి కాలువలు నిర్మాణం చేపట్టి నివేదిక అందించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, క్రిష్ణారెడ్డి, ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, చందురాజు, మాజీ సర్పంచ్ చెంచయ్య, రాజారెడ్డి, వరాలురెడ్డి, ఉప సర్పంచ్ దొరస్వామి,ఎంపీడీవో మోహనమురళీ, తహసీల్దార్ రవికుమార్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి నిరసనకు ఆదికేశవులు కుటుంబ సభ్యుల మద్దతు

విశాలాంధ్ర-పలమనేరు : చిత్తూరు జిల్లాలోని తిరుపతి శ్రీకాళహస్తి పట్టణాలలో చేపడుతున్న చంద్రబాబు నాయుడు అరెస్ట్ కు నిరసనగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో డీకే ఆదికేశవులు కుటుంబ సభ్యులు, పోతు గుంట గురవయ్య నాయుడు కుటుంబ సభ్యులు దీక్షా శిబిరంలో నిరసన చేపడుతున్న టిడిపి నాయకులకు రెండు కుటుంబాలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు.

జేసిఎస్ కన్వీనర్‌గా ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన జే.సి.ఎస్ కన్వీనర్ గా ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ ను కుప్పం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ ఘనంగా సన్మానించారు, డా. సుధీర్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీలోని 12 సచివాలయాలకు, సచివాలయం కన్వీనర్లకు, గృహ సారుదులకు ఇన్చార్జిగా వ్యవహరిస్తూ వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేయాలని విద్యాసాగర్ కోరారు, కన్వీనర్ విద్యాసాగర్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీ పార్టీ అభివృద్ధికి, పార్టీ క్యాడర్ బలోపేతానికి అన్ని విధాలుగా కష్టపడి పనిచేస్తానని తెలిపారు. ఈ అవకాశానిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి జిల్లా మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి, ఎంపీ ఎన్. రెడ్డెప్ప కి , వైకాపా కుప్పం ఇంచార్జ్, జిల్లా అధ్యక్షులు చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ కి విద్యాసాగర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొస్తారు

- బాబుతో నేను' దీక్ష లో టిడిపి నేత మోహన మురళి

విశాలాంధ్ర-వెదురుకుప్పం:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యం లా బయటికి వస్తారని, రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక తప్పుడు కేసుతో అక్రమ అరెస్టు చేసారని టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి పి.మోహన్ మురళి అన్నారు.ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 'బాబుతో నేను' పేరుతో చేపట్టిన దీక్ష జీడీ నెల్లూరు కార్యక్రమంలో భాగంగా మూడవరోజు శుక్రవారం నిరాహార దీక్షలో జగన్ రెడ్డి చర్యలను నిలదీశారు. చంద్రబాబు అవినీతి చేశాడు అనేందుకు ఆధారాలు లేకుండా కేసులు పెట్టి పైసాచిక ఆనందం పొందుతున్న జగన్ రెడ్డి పిచ్చోడి చేతిలో రాయి అన్నచందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి ,మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు,నాయకులు బియ్యం రవి, రమణారెడ్డి ,దామోదర్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, నాగరాజు రెడ్డి షణ్ముగం ,పద్మనాభ రెడ్డి ,తదితరులు దీక్ష లో పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టుకు న్యాయవాదుల నిరసన

విశాలాంధ్ర-పలమనేరు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ పలమనేరు న్యాయవాదులు పలమనేరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకు సంఘీభావంగా ప్లకార్డులను చేతబట్టి మేము సైతం చంద్రబాబుతోనే అంటూ నినాదాలు చేశారు.చట్ట విరుద్ధంగా చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగిందని దాన్ని పూర్తిగా తాము వ్యతిరేకిస్తున్నామని న్యాయవాదులు లక్ష్మీపతి, ఎల్. భాస్కర్,లోకేష్, జగదీష్,కృష్ణలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీగా వస్తున్న న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో న్యాయవాదులకు పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. తాము నిరసన తెలియజేసే హక్కు కూడా లేదా అంటూ పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో లక్ష్మణ్, సుబ్బరామయ్య, షరీఫ్, కృష్ణ, ఫామీద్ బాషా,మునిరాజులు, పార్థసారథి, చంద్ర, గాంధీ,రాజు, రాజశేఖర్, సంధ్య,చాందిని పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం ను నిర్వహించారు ఈ కార్యక్రమానికి బి.సి.ఎస్ విద్యా సంస్థల అధినేత బి.సి నాగరాజ్ పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 15 న ఇంజనీర్ల దినోత్సవం గా వేడుకను జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు. విద్యార్థులు మోక్ష గుండం విశ్వేశ్వరయ్యని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ప్రతిభతో అసాధారణ విజయం సాధించినవారిలో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య ఒకరని, ఇంజనీర్ మన దేశ ఖ్యాతిని నలుదిశలా దాటి ఇంజనీరింగ్ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించారని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో నిర్మాణాలు నేటికీ అవి చెక్కుచెదరలేదని తెలిపారు. కృష్ణ రాజ సాగర్ ఆనకట్ట, బృందావన్ గార్డెన్, భద్రావతి ఉక్కు కర్మాగారం, మైసూర్ బ్యాంక్, దక్కన్ ప్రాంతంలో నీటిపారుదల వ్యవస్థ, స్వయంచాలిత వరదనీటి గేట్లు (పూనా దగ్గర), హైదరబాద్ కు వరద నీటి రక్షణ వ్యవస్థ, విశాఖపట్టణం రేవులో భూకోతను నివారించడం,తిరుమల, తిరుపతి మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక, ఆసియాలోనే మొదటి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్, మైసూర్ సబ్బుల ఫ్యాక్టరీ,శ్రీ జయాదామరాజేంద్ర పాలిటెక్నిక్ కళాశాల, బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం,స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్,మైసూర్ చక్కెర మిల్లులు విశ్వేశ్వరయ్య కృషికి నిదర్శనాలని తెలిపారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా లయన్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ లయన్ కే. భక్తవత్సల రెడ్డి పాల్గొన్నారు. అయన మాట్లడుతూ బావి తరాలు ఇంజనీర్లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని, పరిశోధనలు దేశాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ కార్య క్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డా.స్ .సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.స్.భాస్కరన్, ఆర్. అండ్ డీ డైరెక్టర్ డా. కోదండరామయ్య, కుప్పం మున్సిపాలిటీ లైసెన్సుడ్ ఇంజనీర్ దివాకర్, కుప్పం లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ లయన్ డా .మహేష్ ,లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ జి. గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైయస్సార్ సిపి మండల కన్వీనర్ గా బుజ్జి రెడ్డి

విశాలాంధ్ర - ఐరాల : ఐరాల మండలం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ గా మరోసారి పుత్ర మద్దికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ బుజ్జి రెడ్డి నియమితులైనారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

రొంపిచెర్ల మండల అధ్యక్షుడుగా ఇబ్రహీం ఖాన్

విశాలాంధ్ర-రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల అధ్యక్షుడిగా రాయచోటి ఇబ్రహీం ఖాన్ ను వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఎప్పటినుంచో పార్టీ కోసం కృషి చేశారు. రొంపిచెర్ల మేజర్ పంచాయతీకి ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు. శుక్రవారం అన్ని మండలాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఇబ్రహీం ఖాన్ ను మండలాధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ కార్యకర్తలు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధ్యక్షులు పదవి రావడానికి చేసిన మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి కి రుణపడి ఉంటానని పార్టీ కోసం కష్టపడతానని వచ్చే ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

అవినీతిని కనిపెట్టింది చంద్రబాబే: రాష్ట్ర మంత్రులు

విశాలాంధ్ర- చిత్తూరు: అవినీతిని కనిపెట్టింది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లు ఆరోపించారు. శుక్రవారం చిత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లు ఇద్దరు పెయిడ్ ఆర్టిస్టులేనని చెప్పారు. గతంలో రెండు ఎకరాలు లేని చంద్రబాబు నాయుడు కు నేడు రెండు లక్షల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు జీవితమంతా అవినీతి మయ మేనన్నారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడుల పొత్తు ఊహించిందని చెప్పారు. బిజెపి సైతం కలుపుకోవాలని ప్రయత్నించారని అది సాధ్యం కాక నేడు ఇరువురు ఒకటయ్యారు అన్నారు. చంద్రబాబు నాయుడు తాను ముఖ్యమంత్రి ఉన్నప్పుడు పలు రంగాల్లో అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. అవినీతి కి పాల్పడి జైలు పాలు అయితే నేడు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వీరు ఎన్ని డ్రామాలాడిన తిరిగి అధికారంలోకి వచ్చేది వైసిపి పార్టీ నేనని చెప్పారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర -పుంగనూరు: వినాయక చవితి సందర్భంగా పట్టణ పురవీధులలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే అంశంపై మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అలీమ్ భాషా అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో శుక్రవారం రోజున సమీక్ష సమావేశం జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ హలీం భాష మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొనే వారు ముందస్తు సమాచారం పోలీసులకు తెలపాలన్నారు. దీని వలన ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జానపద కళల చైర్మన్ కొండవీటి నాగభూషణం వైస్ చైర్మన్ లలిత కుమారి మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి అర్బన్ సీఐ రాఘవరెడ్డి కో ఆప్షన్ సభ్యులు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు -ద్విచక్ర వాహనం ఢీ

వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లి :మండలంలోని ,నెల్లిపట్ల గ్రామ శివారు కొండ క్రాస్ వద్ద శుక్రవారం పలమనేరు - నెల్లిపట్ల ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో, ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న, అదే గ్రామానికి చెందిన కేశవులు కుమారుడు 23ఏళ్ల తేజుకు కాలు ఫ్యాక్చర్ అయ్యి తలకు గట్టి దెబ్బలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికుల సమాచారం మేరకు, 108 సిబ్బంది పైలెట్ రవిశంకర్ ఈఎంటి ఈశ్వర్ సకాలంలో స్పందించి ప్రాథమిక వైద్యం అందించి కుప్పం పిఈఎస్ మెడికల్ కాలేజీకి తరలించారని తెలిపారు. ఘటనపై బైరెడ్డిపల్లి పోలీసులకు సమాచారం అందించామన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-చౌడేపల్లె : అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని చౌడేపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.ఎస్.ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు.నాటుసారా విక్రయాలపై తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు.ఈ నేపథ్యంలో మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ,రాజులూరికి చెందిన ఎస్.మునెప్ప కుమారుడు ఎస్.మునిరాజ (50) తమ పల్లె పరిసరాలలో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుండి 20 నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని,అరెస్టు చేసి రిమాండుకు తరలించడం జరిగిందన్నారు.ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు ఎస్.ఐ.వెల్లడించారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని హెచ్ఎం శ్రీవాణి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ ఆరోగ్య భారత్ అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు, ప్రకాష్, వేణుగోపాల్ ,గుర్రయ్య, చంద్రబాబు ,రేణుక దేవి, చలపతి , సైదుల్లా,రాజశేఖర్, పూల రాజేంద్ర, ఈశ్వరయ్య , ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లోని వడ్డిపల్లి లో అక్రమ కర్ణాటక మద్యం వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందడం తో పుంగనూరుకు చెందిన ఎస్ఈబి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్ద రెడ్డెప్ప భార్య మంజుల ఇంటిలో దాచి ఉంచిన 768 బెంగళూరు విస్కీ 90 ఎం.ఎల్. టెట్రా ప్యాకెట్లు ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.25 000/-లు ఉంటుందని ఇన్స్పెక్టర్ సీతారామి రెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎస్.ఐ.అశోక్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు:- వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలు ప్రతిష్టించే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్ లో అనుమతులు తీసుకోవాలని ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల ఏర్పాటు వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వర్షాకాలం కావున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేకుండా కరెంటు విషయంలో జాగ్రత్తలు తీసుకుని వీధుల్లో రాకపోకలు అంతరాయం లేకుండా మండపాలు నిర్మించుకోవాలన్నారు. మూడు రోజులకు పూర్తి చేయాలని అలాగే చేసే స్థలమును పోలీసులకు ముందుగా తెలియజేయాలని కోరారు. నిమజ్జన సమయంలో చిన్న పిల్లలను తీసుకు వెళ్లకుండా జాగ్రత్త తీసుకొని, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గర ఉండి తగు జాగ్రత్తతో నిమజ్జనం నిమజ్జనం చేయాలని అన్నారు.

రెడ్డి కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ మండల కన్వీనర్ గా మతుకు రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం మతుకు వారి పల్లెకు చెందిన మతుకు రమేష్ రెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ పులిచెర్ల మండల కన్వీనర్ గా ఎన్నికైనట్లు ఆ కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ లో అందర్నీ కలుపుకొని క్రమశిక్షణతో, సమన్వయంతో కృషి చేస్తానని అన్నారు. జాతి ఐక్యత కోసం, అభివృద్ధి కోసం అన్ని విధాల చేయూతనిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. నా మీద నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా చవితి వేడుకలు జరుపుకోవాలి

విశాలాంధ్ర - ఐరాల : ఈనెల18వ తేదీ సోమవారం వినాయక చవితి సందర్భంగా ఐరాల పోలీసులు తెలియజేయడము ఏమనగా గ్రామాలలో వినాయక చవితి జరుపుకునే వారు ఐరాల పోలీస్ స్టేషన్కు వచ్చి విగ్రహం ఎత్తు, విగ్రహం పెట్టదలచిన స్థలము, ఎప్పటినుంచి ఎప్పటి వరకు పెడతారు అని, నిమజ్జనం యొక్క తేదీల వివరాలను తెలిపి పర్మిషన్ తీసుకోవాలని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక చవితిని జరుపుకోవాలని ఐరాల ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిమూలం

విశాలాంధ్ర- సత్యవేడు:సత్యవేడు పట్టణంలో ఎట్టకేలకు అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు.శుక్రవారం పట్టణంలోనే వారపు సంతపక్కనే అంబేద్కర్ కమ్యూనిటీ స్థలం వద్ద ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్థానిక జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,అంబేద్కర్ ఆర్మీ సంఘం వ్యవస్థాపకుడు గోపితో కలసి ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయమన్నారు.భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు తీసుకురావడం వల్లే ప్రజాప్రతినిధులుగా ఎన్నికై చట్టసభలకు వెళ్ళగలుగుతున్నట్టు ఆయన గుర్తు చేశారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం దళితులకే గాక అన్ని వర్గాల వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సురుటపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి,వైస్ ఎంపీపీ సరోజినీ రాబర్ట్,ప్రభుత్వ ఆసుపత్రి సలహా సంఘం సభ్యులు గోవింద్ స్వామి,వైఎస్ఆర్ సీపీ నేతలు రమణ,ఎంపీ రవి, జోసెఫ్,అంబేద్కర్ ఆర్మీ సంఘం ఇంచార్జ్ లాయర్ రాజా,నేతలు ఎత్తిరాస్,వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వరదయ్యపాలెం :తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుల నేపథ్యంలో సత్యవేడు నియోజకవర్గం ఇన్చార్జి హెలెన్ వరదయ్య పాలెం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా రిలే దీక్షను చేపట్టిన సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత నియోజక వర్గస్థాయిలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఈ రిలే నిరాహార దీక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు. రిలే దీక్షకు - మండల నాయకులు, కార్యకర్తలు రిలే దీక్షకు మద్దతు తెలుపుతూగా జనసేన నాయకులు మరియు సిపిఐ నాయకులు దీక్షలో పాల్గొన్న సత్యవేడు నియోజకవర్గం కార్యదర్శి సిపిఐ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ వైసిపికి పతనం మొదలైంది రాజకీయ ప్రలోభాలకు అక్రమ కేసులు పెట్టడం అరెస్టు చేయడం సరికాదన్నారు. 2024 లో రాష్ట్ర ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి తరుణ్ సభ్యులు చంద్ర తదుపరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో నేతలు పూజలు

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో శుక్రవారం హోమాలు వేసి పూజలు నిర్వహించారు,టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ని విడుదల చేయాలంటూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలో భాగంగా మూడవ రోజు కూడా దీక్షలు నిర్వహించారు. దాంతో పాటుగా ,యాగ పూజలు చేశారు. టిడిపి పార్టీ కార్యాలయం వద్ద కలిశ స్థాపన చేసి వేదపండితులు చేత యాగం చేయించారు. చంద్రబాబు వెంటనే విడుదల కావాలని, ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని,2024 ఎన్నికలలో రాక్షస పాలన పోయి రాముని పాలన అందించే టిడిపి పాలన రావాలని, రాష్ట్ర ప్రజలకు శాంతియుత పాలన అందాలని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో తిరుపతి పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ నూలేటి విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు, రిలే నిరాహారదీక్షలో మాజీ మంత్రి పరసా రత్నం తో పాటు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవ్ నాయుడు, చిట్టేటి పెరుమాళ్ ,బుద్ధి విజయలక్ష్మి,మంజుల తదితరులు పాల్గొనడం జరిగింది.

మండల స్థాయి క్రీడల పోటీలలో పాల్గొన్న ఎంపీపీ

విశాలాంధ్ర- పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు జడ్పీపి పి హైస్కూల్ నందు మండల ఎంపీపీ పోలంరెడ్డి. శేఖర్ రెడ్డి, జడ్పిటిసి నన్నం. ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ క్రీడల్లో మండలములో ఏడు హై స్కూళ్లకుగాను ఆరు హైస్కూల్ నుండి సుమారు 60 మంది పాల్గొని వాలీబాల్, బ్యాడ్మింటన్, కో కో, కబడి మొదలైన ఆటలను విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో తమ ప్రతిభను కనపరిచారు. పిటి టీచర్ లేనందువల్ల రోసునూరు హై స్కూల్ నుండి విద్యార్థులు పాల్గొనలేక పోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ క్రీడలలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో తమ ప్రతిభను ప్రదర్శించారని, మండల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో ఆడి తద్వారా మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, ఎంఈఓ శంకరయ్య, హెచ్ఎం మునిశేఖర్ ,సర్పంచ్ వాని, రఘునాయుడు మరి కొంతమంది నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిగువ చావాలి వద్ద గుర్తు తెలియని శిశువు మృతదేహం

విశాలాంధ్ర-పెళ్ళకూరు : మండలంలోని దిగు చావాలి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్కన గుర్తు తెలియని శిశు మృతదేహం ఉండటంతో, స్థానికుల సమాచారంతో పెళ్లకూరు మండలం ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు ,అనంతరం ఈ విషయమై ఎస్ఐ మాట్లాడుతూ అప్పుడే జన్మించిన శిశువును కనీసం బొడ్డు కూడా కట్ చేయలేదని గుర్తు తెలియని వ్యక్తులు బ్రిడ్జ్ పక్కన వ్యవసాయ స్థలంలో గురువారం రాత్రి పడవేసి వెళ్లి ఉండవచ్చని పారవేసి వెళ్లినందున కుక్కలు లేదా నక్కలు రెండు కాళ్ళను పీకి తిని వేయడంవల్ల, కాళ్లు తప్ప మిగిలిన శరీర భాగం బాగా ఉబ్బిపోయి ఉందని ,చేతి భాగాన్ని డిఎన్ఏ టెస్ట్‌కు పంపి , వీఆర్వో సహకారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

కుక్కంబాకం ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి:సిపిఐ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మండలం కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నెంబరు 81 లోని 82 ఎకరాల భూమిని పేదలకు పెంచాలని సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య కోరారు. శుక్రవారం తహసిల్దార్ భార్గవ్ కి సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కత్తి ధర్మయ్య మాట్లాడుతూ, కుక్కంబాకం పరిధిలో ఉన్న దళితులకు యానాదులకు, భూములను నిరుపేదలకు పంచాలన్నారు.81 సర్వే నెంబర్లు ఉన్న 80 ఎకరాలు ప్రభుత్వ భూమిని అర్హులైన స్థానిక పేద ప్రజలకు పంచాలని కోరారు అమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరి నాదముని యాదవ్ మృతి బాధాకరం

సంస్మరణోత్సవంలో ఆవేదన వ్యక్తం చేసిన విలేకరులు

విశాలాంధ్ర-చంద్రగిరి: సీనియర్ విలేకరి ఆవుల నాదముని యాదవ్ 63 సం.లు బుధవారం గుండెపోటుతో హఠాస్మరణం చెందటం బాధాకరమని విలేకరులు విచారం వ్యక్తం చేశారు. ఏపీ డబ్ల్యూయుజె సెక్రటరీ గల్లా సుబ్రహ్మణ్యం రాయల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నాదముని యాదవ్ సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాదముని యాదవ్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. యాదవ్ తో తమకు కలిగిన సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. యాదవ ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. విలేకరులు నరేష్ రెడ్డి, సోమనాథరెడ్డి, లీలా కృష్ణ,జానకి రామ్ ఆచారి, రాజగోపాల్, కిషోర్, కన్నయ్య, రాజారెడ్డి, రఘు, రమణ, రూప సుందర్ నాయుడు, పార్థసారథి, తిరుమల,జయచంద్ర, చంద్రశేఖర్, సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలు ఆదర్శనీయం

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు

విశాలాంధ్ర- తిరుపతి : నేటి ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు కోరారు. స్థానిక ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ మోక్షగుండం ఇంజనీర్ గా అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచారన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరాయ పేద కుటుంబంలో జన్మించినప్పటికీ నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సమాజాభివృద్ధిలో మరపురాని పాత్రను పోషించారన్నారు. పనినే దైవంగా భావించిన ఆయనను అప్పట్లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించడం గొప్ప విషయమన్నారు. దేశంలోని 8 విశ్వ విద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసి గౌరవించాయని తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎపిసిపిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జె. పద్మాజనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని ఇంజనీర్లు మోక్షగుండం అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన

ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు వి.ఎన్. బాబు, ఎన్.వి.ఎస్. సుబ్బరాజు, కె. శివ ప్రసాద రెడ్డిలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరాయ సమాజానికి మహోన్నత సేవలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డి.ఎస్. వర కుమార్, డి.వి. చలపతి, పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె. విజయకుమార్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎ. రాధా జయశ్రీ, జనరల్ మేనేజర్లు వి. రాధాకృష్ణమ రాజు, బి. చంద్రశేఖర్ రావు, ఆదిశేషయ్య, జానకిరామ్, శోభావాలెంటీనా, రామచంద్రరావు, మురళి, సురేంద్ర రావు, శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా ఉమ్మడి శత్రువు వైసీపీనే: ఎస్సీవీ

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి శత్రువు వైసీపీనేనని కుదిరితే కమ్యూనిస్టులు, బీజేపీలనూ కలుపుకుని జగన్ ప్రభుత్వాన్ని ఓడిస్తామని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో వైసీపీ వ్యతిరేక పార్టీలు 175 స్థానాల్లో గెలుపొందడం ఖాయమని జోష్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు శుక్రవారం తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అప్రజాస్వామిక పద్ధతిలో అరెస్టు చేయడం బాధాకరమన్నారు. రాజమండ్రి జైలులో చంద్రబాబును కలిసి వచ్చిన వెంటనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీతో పొత్తును ఖరారు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేని దౌర్భాగ్య పాలన ఈ నాలుగేళ్లలో కొనసాగిందంటూ పరోక్షంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పై విమర్శలు చేశారు. పొత్తుల నేపథ్యంలో శ్రీకాళహస్తి టిక్కెట్టు ఏ అభ్యర్థికిచ్చినా కలిసికట్టుగా గెలిపించుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు చక్రాల ఉష, నారాయణ యాదవ్, గోగినేని భాస్కర్ నాయుడు, హరిబాబు నాయుడు, పూల ఆనంద్ పాల్గొన్నారు.

పవన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి వినుత కోటా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాజమండ్రి సెంట్రల్ జైలులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పరామర్శించి, రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాం అని ప్రకటించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వినుత కోటా తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో వైసీపీ అరాచక, అవినీతి పాలన అంతమొందించాలంటే అన్ని పార్టీలు కలిసి పోటీ చేసి వ్యతిరేకత ఓటు చీలకుండా వైసీపీ పార్టీ వచ్చే ఎన్నికల్లో అధఃపాతాళానికి వెళ్లేట్టు చెయ్యాలని పవన్ కళ్యాణ్ వేసిన వ్యూహంతో కంగుతిన్న జగన్ రెడ్డి, వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు పవన్ కళ్యాణ్ పైన చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మండి పడ్డారు. నియోజకవర్గంలో ఉన్న కంపెనీలు, ఫ్యాక్టరీలు, వ్యాపారస్తుల దగ్గర ప్యాకేజీలు తీసుకోవడంలో ఎమ్మెల్యే ఎక్స్‌పర్ట్ అయ్యాడని వినుత మండిపడ్డారు. ఈయన పవన్ కళ్యాణ్ పై ప్యాకేజ్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నారు కాబట్టి దమ్ముంటే నిరూపించాలని మండిపడ్డారు. నియోజకవర్గంలో పెద్ద బందిపోటులా వ్యవరిస్తున్న ఎమ్మెల్యేకి ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు.

యాంత్రీకరణ సాంకేతిక పరిజ్ఞానం రైతులు అవసరం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ ప్రసాదరావు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లాలో రైతాంగం వ్యవసాయంతో నాణ్యత గల అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన సాగు యాజమాన్య పద్ధతులతో పాటు యాంత్రికరణ సాంకేతిక పరిజ్ఞానం రైతుల పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పల్లమాల, బి ఎస్ కండ్రిగ రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, రైతు భరోసా కేంద్రాలు ఎరువులను పరిశీలించారు, ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు రైతులతో మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో జరుగుతున్న మార్పులకు రైతులు వ్యవసాయ అధికారులు సూచనలతో సకాలంలో మేలైన సాగు యాజమాన్య పద్ధతులను సకాలంలో ఆచరించాలి. ఇటీవికాలంలో కాలంలో మన చుట్టూ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పడడంతో రైతు కు కూలీల సమస్య జఠిలమై వ్యవసాయసాగు పనులలో సకాలంలో చేపట్టకపోవడంతో దిగుబడులు తగ్గి ఖర్చులు పెరగడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. దీనికి అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.సాగులో ఆధునిక యాంత్రీకరణ పరిజ్ఞానాన్ని ఉపయోగించలన్నారు.వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వివిధ పంటల సాగులో పలు రకాల పనిముట్లు, యాంత్రాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు ప్రైవేటు రంగ నిపుణులు రూపొందించి రైతు లోకానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. గత కాలంలో రైతులు ఎక్కువగా నేల తయారీ మరియు విత్తే పరికాలను వినియోగించేవారు. ఈ మధ్య కాలంలో ఎరువులను సమర్థవంతంగా వాడటానికి ఎరువులు వేయు పరికరాలు, కలుపు యాజమాన్యానికి తుంపర్ల, బిందు సేద్య పరికరాలు, సకాలంలో కోత, నూర్పిడి చేపట్టడానికి రూపర్లు, మరియు పలు రకాల కోత యంత్రాలు వినియోగం బాగా వృద్ధి చెందిందన్నారు, యూరియా, డిఎ పి,20:20:0:13 వీటితో పాటు ఎరువులు రైతుకు అందుబాటులో ఉన్నాయన్నారు సద్విని చేసుకోవాలన్నారు, రైతులు కచ్చితంగా పీఎం కిసాన్,ఈ కేవైసీ,ఈ పంట నమోదు, చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి భారతి, పల్లమాల గ్రామ రైతు గోపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి,బాబు రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది. లత, లావణ్య,పాల్గొన్నారు.

అరవిందో సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి : అరవిందో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరవిందో కంపెనీ స్టేట్ హెచ్ఆర్ బ్రహ్మం కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నందు శుక్రవారం 108 సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అరవిందో కంపెనీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హెచ్ఆర్ ఇన్చార్జి బ్రహ్మం మాట్లాడుతూ అరవిందో కంపెనీ ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. 108 సర్వీస్ లో ఎక్కడైనా లోపాలు ఉంటే తమకు తెలియజేయాలని 108 సేవలు 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రజలు మరియు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ సేవను సద్వినియోగం చేసుకొని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ శివ రాకేష్ డియ్యం విజయ్ కుమార్ మరియు శ్రీనివాసులు సంతోష్ ఎంపీడీవో కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ది అసోషియేషన్ ఆఫ్ ప్లానర్స్- ఇంజనీర్స్

విశాలాంధ్ర- తిరుపతి : ది అసోషియేషన్ ఆఫ్ ప్లానర్స్-ఇంజనీర్స్ (1477) ఆధ్వర్యంలో 1404 నందు బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ తీ మ్యానుఫ్యాక్చర్స్‌కి సంబందించిన అన్నిరకాల మెటీరియల్, టెక్నాలజీస్, మిషనరీ ఎక్విప్మెంట్ ఎగ్జిబిషన్‌తో పాటు ఎక్స్పర్ట్స్‌తో ఇంటరాక్షన్ సదుపాయం నిర్వహించబడును. ఈ కార్యక్రమాన్ని తేది.07-01-2028న శనివారం ఉదయం 10 గంటలకు తిరుపతి శాసన సభ్యులు గౌరవనీయులైన భూమన కరుణాకర్ రెడ్డి ప్రారంభించెదరు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమానికి తుడా చైర్మన్ మరియు చంద్రగిరి శాసన ఎ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమాలలో తిరువతి కార్పోరేషన్ మేయర్ డా.శిరీష డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ హాజరవుతున్నారు. తిరుపతి ప్రజలందరు కూడా పాల్గొని మా అసోషియేషన్ అందించు బహుమతులను స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా కోరారు. ఈ యొక్క కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కలదు. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ యం.ప్రసాద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి.షణ్ముగం, చైర్మన్ వెంకటేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శివప్రసాద్, ట్రెజరర్ నరేష్ మరియు కమిటీ సభ్యులు వి. సురేష్, సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, శివశంకర్ రెడ్డి, రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు రాజకీయ కక్ష

మాజీ కేంద్ర సహాయమంత్రి పనబాక లక్ష్మి

విశాలాంధ్ర - గూడూరు : స్కిల్ డెవలప్మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి ఎటువంటి అవినీతికి పాల్పడలేదని మాజీ ఐఏఎస్ అధికారులు చెబుతున్నా పట్టించుకోవడంలేదని రాజకీయ కక్షతో మాజీ ముఖ్యమంత్రిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని మాజీ కేంద్ర సహాయమంత్రి పనబాక లక్ష్మి వెల్లడించారు. గూడూరు పట్టణంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే సునిల్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో ఆమె పాల్గొన్నారు.శుక్రవారం ఈ దీక్షలు 3వ రోజుకు చేరుకున్నాయి. 3వ రోజు సంఘీభావంగా మాజీ కేంద్ర సహాయ మంత్రి పనబాక లక్ష్మి, కోవూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనబాక లక్ష్మి మాట్లాడుతూ అక్రమంగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని ప్రజలు చెబుతున్నారన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య. పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, గుండాల లీలావతి, మట్టం శ్రావణి, అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

స్మశాన రహదారిని ఆక్రమించారని మృతదేహంతో నిరసన



విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలం విందూరు గ్రామ శివారులో శుక్రవారం రహదారిని ఆక్రమించారని మృత దేహంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ స్మశానానికి వెళ్లే రహదారిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించడం దారుణమన్నారు. న్యాయం జరిగే వరకు మృతదేహం తీసేది లేదని గ్రామస్తులు భీష్మించారు. దీంతో ఆ గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెవెన్యూ, పోలీసు శాఖలు జోక్యం చేసుకుని గ్రామ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ దీక్షలకు జనసేన సంఘీభావం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని గమళ్లపాలెంలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మూడు రోజులుగా పార్టీ కార్యాలయంలో రిలేదీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షులు, జనసేన నాయకుడు సయ్యద్ నయీమ్ 50 మంది కార్యకర్తలతో కలిసి దీక్షా శిబిరానికి చేరుకున్నారు. దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టీడీపీ నాయకులకు సంఘీభావం తెలిపారు. అనుభవజ్ఞులైన మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమన్నారు. టీడీపీ పోరాటంలో తాము భాగస్వాముల వుతామన్నారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు, చిరంజీవి యులత, పవన్ యువత నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీఓ డా.వెంకటనారాయణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పంచాయితీ కార్యదర్శులకు,ఏఎన్ఎంలకు, ఎంఎల్ హెచ్పీ లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో ఎంపిడిఓ డా.వెంకటనారాయణ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ హెచ్పీ, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దామినేడు,మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, సిడిపిఓ, ఐసిడిఎస్,ఎంఈఓ,ఏపిఎంలు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆగమ పండిత దంపతులకు పసుపు, కుంకుమ సమర్పణం

విశాలాంధ్ర - వాకాడు:మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభి రామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ద్వారా శ్రీ వైఖానస ఆగమపండిత దంపతులు నారాయణ వేంకట సందీప్ దీక్షిత్, భార్గవి లకు సంస్థ ప్రతినిధులు దీవి అనంతబాబు, వంశిప్రియ పసుపు, కుంకుమ అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి అనంత బాబు మాట్లాడుతూ హైందవ ధర్మంలో కులవృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న అర్చకులు, పురోహితులకు వివాహాలు కావడం మృగ్యమైన పరిస్థితులలో జీవిస్తున్నారన్నారు. బ్రాహ్మణ ఆడపడుచులను ప్రోత్సహించాలనే సదుద్దేశ్యంతో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి హైమావతమ్మ దంపతులు సుమారు ఎనిమిది వేల రూపాయలు విలువ చేసే రజత పుష్పాలను, శ్రీవారి ప్రసాదం, కూరగాయలు, పసుపు, కుంకుమలను అందజేసినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వినుకొండ సత్యవరప్రసాద్, విద్యుల్లత,వినుకొండ వేంకట రామాచార్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : "రాస్" ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. రాష్ట్రీయ సేవా సమితి పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు ఆదేశానుసారం శ్రీకాళహస్తి , బహదూర్ పేట, నల్ల గంగమ్మ గుడి ఆవరణలో రాస్, టాటా ట్రస్ట్ వారిచే, ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేషమైన స్పందన వచ్చింది. రాస్ ద్వారా శ్రీకాళహస్తి పట్టణము, పరిసర అన్ని గ్రామీణ ప్రాంతాలలో రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణతో పాటు, ఎన్నో రకాలుగా సభ్యులకు, వారి కుటుంబాలకు విరివిగా ఆర్థికేతర కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా ఈనాడు వారి ఆరోగ్యం పై ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహనపై, భరోసా కల్పిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలకు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ సిబ్బంది, రాస్ మహిళా వాణి సిబ్బంది, క్లస్టర్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడే మండలపరిషత్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం, మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఉదయం 11 గంటలకు యంపిపి తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడివో నిర్మలదేవి శుక్రవారం తెలిపారు. జడ్పీటీసీ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నారు. అన్ని శాఖల పనులపై సమీక్ష జరుగుతుంది.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని స్థాపిద్దాం

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్

విశాలాంధ్ర-తొట్టంబేడు: బాల్య వివాహాలు లేని సమాజాన్ని స్థాపించేందుకు అందరం కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి, త్రివర్ణ, , ఏసీడీయస్ పద్మావతి అన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం 'బాల్యవివాహాలు లేని నవ సమాజం నిర్మాణం' పేరిట జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ... రాష్ట్రంలో 26 జిల్లాల్లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషను ఆధ్వర్యంలో విరివిగా బాల్యవివాహాలు నిర్మూలనకు గ్రామస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. బాల్య వివాహాలు నిర్వహించే వారిని, ప్రోత్సహించే వారి పైన ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీస్ అధికారులకు ఆదేశాలిస్తున్నామన్నారు. ఇక శ్రీకాళహస్తి సీడీపీవో శాంతిదుర్గ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు, కమిషను సూచనలతో గ్రామస్థాయి నుండే అవగాహన కార్యక్రమాలు, అధిక స్థాయిలో నిర్వహించి, బాల్య వివాహాలు నిర్మూలన దిశగా అడుగులు వేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-చిట్టమూరు: షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైన సంఘటన వేము గుంట పాలెం లో చోటు చేసుకుంది.వివరాల్లోకెళ్తే మండలంలోని కోగిలి పంచాయతీ పరిధిలోనీ వేముగుంటపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల లక్ష్మయ్య కుమారుడు ఆళ్ల భూపయ్య వారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ మంటలు అదుపు చేసే లోపల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది వాళ్ళ పొలం పనులు కోసం తెచ్చుకున్న ఒకటిన్నర లక్షల రూపాయల నగదు,నాలుగు సవర్ల బంగారు,ఆస్తికి సంబంధించిన పత్రాలు, సామాగ్రి తో సహా పూర్తిగా కాలిపోయాయి కట్టుబట్టలతో బయటపడ్డట్టు గ్రామస్తులు చెబుతున్నారు ఈ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాబు అరెస్టుకు నిరసనగా కొనసాగుతున్న

రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర- తిరుపతి : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మూడవ రోజున నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,పుష్పావతి యాదవ్ మరియు తెలుగుదేశం మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.